సాక్షి
అనకాపల్లి
సోమవారం । 6 । ఫిబ్రవరి । 2023




ముగిసిన దేవీ తీర్థం

దేవరాపల్లిలో నిర్వహిస్తున్న ఉమామహేశ్వరీ దేవి కల్యాణ(తీర్థ) మహోత్సవాలు ఆదివారంతో ఘనంగా ముగిశాయి. 8లో



వైభవంగా వసంతోత్సవం

కల్యాణోత్సవాల్లో భాగంగా కేశవస్వామి వారికి నాగవల్లి వసంతోత్సవం కనుల పండువగా ఆదివారం జరిగింది. 8లో



పాపికొండలకు భారీగా పర్యాటకులు

వీఆర్‌పురం: మండలంలో 452 మంది పర్యాటకులు 7 బోట్లలో పాపికొండల వీక్షణకు ఆదివారం వెళ్లారు.

న్యూస్‌రీల్

ప్రజా సంక్షేమానికి కృషి చేయండి

● క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి గుడివాడ అమర్‌నాథ్

అనకాపల్లిటౌన్ : ప్రభుత్వ పథకాలను ప్రజలకు సకాలంలో అందజేసి, వారి సంక్షేమానికి కృషి చేయడంతో పాటు ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని రాష్ట్ర ఐటీ, పరిశ్రమ లశాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. సచివాలయ ఎంప్లాయీస్ ఫెడరేషన్ క్యాలెండర్‌ను ఆదివారం ఆయన తన గృహంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సచివాలయ ఉద్యోగులకు అన్ని విధాలా తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని భరోసానిచ్చారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఎస్.వి. గణేష్, విశాఖజిల్లా అధ్యక్షుడు పి.జె.గణేష్‌కుమార్, ఫెడరేషన్ సభ్యులు డి.కోటేశ్వరరావు, జె.వెంకటేష్, పి.అచ్యుతరావు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఎన్ఎంఎంఎస్ పరీక్ష



పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న డీఈవో లింగేశ్వరరెడ్డి

తుమ్మపాల: నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్ షిప్ పరీక్ష ప్రశాంతంగా జరిగినట్టు డీఈవో బి.లింగేశ్వరరెడ్డి తెలిపారు. పలు పరీక్ష కేంద్రాలను ఆదివారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో మొత్తం 19 కేంద్రాల్లో ఈ పరీక్ష నిర్వహించినట్టు చెప్పారు. 4,315 మంది విద్యార్థులకు గాను 4,115 మంది హాజరయ్యారని, 200 మంది హాజరు కాలేదన్నారు. రెండు బృందాలుగా తనిఖీలు నిర్వహించినట్టు చెప్పారు. పరీక్ష కేంద్రాల వద్ద పోలీసు బందోబస్తు, ఆరోగ్య సిబ్బందిని ఏర్పాటు చేశామన్నారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగలేదని డీఈవో తెలిపారు.

ధ్యానంతో సంపూర్ణ ఆరోగ్యం

● ఎంపీ సత్యవతి



ఎంపీ సత్యవతి దంపతులను సత్కరిస్తున్న క్షేత్రం నిర్వాహకులు, ధ్యాన గురువులు

అనకాపల్లిటౌన్ : ధ్యానంతో సంపూర్ణ ఆరోగ్యాన్ని పొందవచ్చని ఎంపీ భీశెట్టి సత్యవతి తెలిపారు. జీవీఎంసీ విలీన గ్రామమైన సిరసపల్లి చింతామణి దత్తక్షేత్రంలో జరుగుతున్న ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో ఆదివారం ఆమె ముఖ్యఅతిథిగా మాట్లాడారు. విద్యార్థి దశ నుంచి ధ్యానాన్ని అలవర్చుకోవాలన్నారు. శాకాహారాన్ని తీసుకుంటూ ధ్యానం చేయడం ద్వారా దేహంలో ప్రతీకణం శుభ్రపడుతుందని, తద్వారా అఖండమైన మానసిక వికాసం కలుగుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో 84వ వార్డు కార్పొరేటర్ చినతల్లి, క్షేత్రం నిర్వాహకులు, ధ్యాన గురువులు పాల్గొన్నారు.

హతియా-మంగుళూరు మధ్య వీక్లీ స్పెషల్

తాటిచెట్లపాలెం(విశాఖ ఉత్తర): ప్రయాణికుల రద్దీ దృష్ట్యా ప్రస్తుతం హతియా-మంగుళూరు సెంట్రల్ మధ్య వీక్లీ స్పెషల్ రైళ్ల నడుపుతున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డీసీఎం త్రిపాఠీ తెలిపారు. హతియా-మంగుళూరు సెంట్రల్ (08645) వీక్లీ స్పెషల్ హతియాలో ప్రతీ సోమవారం ఉదయం 4.50 గంటలకు బయల్దేరి ఆదేరోజు రాత్రి 8.43గంటలకు దువ్వాడ చేరుకుంటుంది. అక్కడ నుంచి 8.45 గంటలకు బయల్దేరి బుధవారం తెల్లవారు 4.15గంటలకు మంగుళూరు సెంట్రల్ చేరుకుంటుంది. ఈ స్పెషల్ రైలు ఈనెల 6, 13, 20, 27 తేదీలలో నడుస్తుంది. తిరుగు ప్రయాణంలో మంగుళూరు సెంట్రల్(08646)లో ప్రతీ గురువారం తెల్లవారు 4 గంటలకు బయల్దేరి మరుసటిరోజు మధ్యాహ్నం 12.08 గంటలకు దువ్వాడ చేరుకుంటుంది. అక్కడ నుంచి 12.10 గంటలకు బయల్దేరి శనివారం తెల్లవారు 4.30గంటలకు హతియా చేరుకుంటుంది. ఈ స్పెషల్ రైలు ఈనెల 9, 16, 23 మార్చి 2 తేదీల్లో నడుస్తుంది.

పున్నమి వేళ.. పోటెత్తిన భక్త జనం



ఎస్.రాయవరం మండలం రేవు పోలవరం తీరంలో పుణ్యస్నానాలు ఆచరిస్తున్న భక్తులు

8లో

తీర ప్రాంతాలు జనసంద్రంగా మారాయి. సంద్రంతోపాటు భక్తులు పోటెత్తారు. మాఘ పౌర్ణమి సందర్భంగా పలు తీరాల్లో భారీ ఎత్తున భక్తులు పుణ్యస్నానాలు ఆచరించారు. పలువురు పితృదేవతలకు తర్పణాలు వదిలడంతో పాటు ప్రత్యేక పూజలు చేశారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా రేవుపోలవరం, పూడిమడక తదితర తీర ప్రాంతాల్లో పోలీసులు భారీ ఎత్తున బందోబస్తు నిర్వహించారు. ఆర్టీసీ అధికారులు ప్రత్యేక బస్సులు నడిపారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఉత్సవాల నిర్వాహకులు పకడ్బందీగా ఏర్పాట్లు చేశారు. పలు స్వచ్ఛంద సంస్థల సభ్యులు మజ్జిగ, తాగునీరు సరఫరా చేశారు.



తీరంలో పుణ్యస్నానం చేయిస్తున్న పురోహితుడు



పూడిమడక తీరంలో భక్తుల సందడి

కార్గో రవాణాపై నిఘా!

● అడ్డగోలు సరకు రవాణాకు అడ్డుకట్ట
● ఇటీవల రేషన్ బియ్యంతో పట్టుబడిన డీజీటీ
● అప్రమత్తమైన ఆర్టీసీ అధికారులు
● బుకింగ్ ఏజెంట్లు, కాంట్రాక్టర్లు, సిబ్బందికి హెచ్చరిక



ఆర్టీసీ లాజిస్టిక్స్ కంటైనర్

సాక్షి, విశాఖపట్నం: కార్గో రవాణాలో అక్రమాలకు ఆస్కారం లేకుండా ఆర్టీసీ పటిష్ట చర్యలు తీసుకుంటోంది. ఇటీవల శ్రీకాకుళం జిల్లాలో ఆర్టీసీ కార్గో బస్సులో రేషన్ బియ్యం రవాణా చేస్తూ పట్టుబడిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఇకపై అలాంటి ఘటనలు పునరావృతం కాకుండా గట్టి నిఘా పెట్టనుంది. అంతగా తనిఖీల బెడద ఉండదన్న ఉద్దేశంతో అక్రమార్కులు ఆర్టీసీ కార్గో బస్సుల్లో నిషేధిత, అక్రమ సరకు రవాణాను ఎంచుకుంటున్నారు. కాంట్రాక్టర్లు, ఏటీబీ (ఆథరైజ్డ్ టికెట్ బుకింగ్) ఏజెంట్లకు కూడా సరకు రవాణా బుకింగ్ సదుపాయాన్ని ఆర్టీసీ కల్పించింది. దీనిని కొంతమంది దుర్వినియోగం చేస్తున్నారు. ఒక సరకు పేరు చెప్పి మరొక సరకును రవాణా చేస్తున్నారు. శ్రీకాకుళం జిల్లాలో పట్టుబడిన డీజీటీ వాహనంలో నూకలు పేరు చెప్పి రేషన్ బియ్యాన్ని రవాణా చేశారు. ఈ వ్యవహారంలో సంబంధిత డీజీటీ ఔట్‌సోర్సింగ్ డ్రైవర్, కాంట్రాక్టరు ఉన్నట్టు గుర్తించారు. వారిపై కేసు నమోదు చేశారు. ఆర్టీసీ కార్గోలో సిమెంట్, హార్డ్‌వేర్, గృహావసర సరకులు, గోధుమ పిండి, దుస్తులు, మందులు, నూకలు వంటివి రవాణా జరుగుతోంది.

కొందరు అద్దదారులు తొక్కడంతో..

ఇప్పటికే ఆర్టీసీ కార్గో సేవలకు మంచి ఆదరణ లభిస్తోంది. ఫలితంగా ఆదాయం బాగానే సమకూరుతోంది. దీంతో ఈ కార్గో వ్యవస్థను మరింత విస్తృతం చేయాలన్న యోచనలో ఉంది. ఇలాంటి తరుణంలో సరకు రవాణాలో కొందరు అడ్డదారులు తొక్కడం ఆర్టీసీ ఉన్నతాధికారులను కలవరానికి గురి చేస్తోంది. దీనికి అడ్డుకట్ట వేయకపోతే ఈ కార్గో వ్యవస్థకే ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందని భావిస్తోంది. అందుకే ఆర్టీసీ లాజిస్టిక్స్ కంటైనర్లు/డీజీటీ (డిపో గూడ్స్ ట్రాన్స్‌పోర్టు వాహనాలు)ల్లో సరకు బుకింగ్, రవాణాలపై గట్టి నిఘా పెట్టాలన్న నిర్ణయానికొచ్చింది. వీటిలో రేషన్ బియ్యం, తలవెంట్రుకలు, చేపలు, మద్యం తదితర వాటితో పాటు నిషేధిత సరకులు/వస్తువులను అనుమతించకుండా పటిష్ట చర్యలు తీసుకుంటోంది. దీనిపై సంబంధిత ఏటీబీ ఏజెంట్లు, కాంట్రాక్టర్లు, ఆర్టీసీ సిబ్బందికి ముందుగా సమావేశాల ద్వారా అవగాహన కల్పించడం, హెచ్చరికలు జారీ చేయడం వంటివి చేస్తున్నారు. ఇలాంటి అక్రమ రవాణాలో భాగస్వామ్యం ఉన్న వారిని ఉద్యోగాల నుంచి తొలగింపు వంటి కఠిన నిర్ణయాలు తీసుకుంటామని, బాధ్యులైన ఏటీబీ ఏజెంట్లు, కాంట్రాక్టర్ల ఏజెన్సీలను రద్దు చేయడమే కాకుండా వారిపై కేసులు నమోదు చేస్తామని ఆర్టీసీ జోన్-1 ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ చింతా రవికుమార్ 'సాక్షి'తో చెప్పారు.

మధురవాడ-హైదరాబాద్ బస్సు రద్దు

మరోవైపు గంజాయి అక్రమ రవాణా బెడద కూడా ఆర్టీసీకి ఉంది. మధురవాడ నుంచి భద్రాచలం మీదుగా హైదరాబాద్ వెళ్లే బస్సులో గంజాయి రవాణా చేస్తున్నట్టు వెలుగు చూసింది. నర్సీపట్నం, చింతపల్లి, సీలేరు, చింతూరు, వీఆర్‌పురం, నేరెళ్ల, ఎటపాక, భద్రాచలం ఏజెన్సీ ప్రాంతాల మీదుగా ఈ బస్సు ప్రయాణిస్తుంది. అక్రమార్కులు ఈ బస్సును గంజాయి రవాణాకు అనువుగా మలుచుకున్నారు. పలుమార్లు దీనికి అడ్డుకట్ట వేయడానికి ప్రయత్నించినా వీలు కాలేదు. దీంతో ఆర్టీసీ అధికారులు ఇటీవల ఆ బస్సు సర్వీసును రద్దు చేశారు.

కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదు

సాక్షి,పాడేరు: అల్లూరి సీతారామరాజు జిల్లాలో కనిష్ట ఉష్ణోగ్రతలు కొనసాగుతున్నాయి. ఆదివారం అరకు కేంద్ర కాఫీబోర్డు వద్ద 8.8 డిగ్రీలు, చింతపల్లి ఆర్ఏఆర్ఎస్, పాడేరు మండలం మినుములూరులో 10 డిగ్రీల చొప్పున ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. పాడేరు, చింతపల్లి ప్రాంతాల్లో పొగమంచు దట్టంగా కురుస్తోంది.

బీఎన్ రోడ్డులో కష్టాలకు చెక్



కూలిన ఇరుకు వంతెనపై నుంచి వెళ్తున్న వాహనాలు



డైవర్షన్ రోడ్డు ఏర్పాటుకు పొక్లెయిన్లతో చేపడుతున్న పనులు

● వడ్డాది వంతెన వద్ద డైవర్షన్ రోడ్డు పనులు ప్రారంభం
● మూడు జిల్లాల ప్రయాణికులకు తొలగనున్న ఇబ్బందులు

బుచ్చెయ్యపేట : భీమునిపట్నం, నర్సీపట్నం (బీఎన్) రోడ్డులో ప్రయాణికుల కష్టాలు తొలగనున్నాయి. వడ్డాది పెద్దేరు వంతెన వద్ద డైవర్షన్ రోడ్డు పనులు ప్రారంభమయ్యాయి. కూలిన వంతెన పక్క నుంచి డైవర్షన్ రోడ్డు నిర్మాణానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేయడంతో ఆర్అండ్‌బీ అధికారులు పనులు చేపట్టారు. నాలుగు నెలల కిందట అధిక వర్షాలకు పెద్దేరు నదిపై ఉన్న వడ్డాది వంతెన కుంగిపోయింది. 50 సంవత్సరాల కిందట నిర్మించిన ఈ వంతెన శిథిలావస్థకు చేరగా, నీటి ఉధృతికి నాలుగు ఖానాలు కూలిపోయాయి. అనకాపల్లి, విశాఖపట్నం, అల్లూరి సీతారామరాజు జిల్లాలతో పాటు కాకినాడ, రాజమండ్రికి నడిచే ఆర్టీసీ బస్సులు, ఇతర వాహనాల రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. అప్పట్లో రూ.25 లక్షల వ్యయంతో తాత్కాలికంగా పాదచారులు, ఆటోలు, కార్లు రాకపోకలు సాగేలా వంతెనకు మరమ్మతులు నిర్వహించారు. రెండు నెలల కిందట మరో రూ.ఐదు లక్షలతో కుంగిన వంతెనపై పనులు చేపట్టి గోవాడ సుగర్ ఫ్యాక్టరీకి ట్రాక్టర్లు, లారీలతో చెరుకు తరలింపు, ఆర్టీసీ బస్సులు ఇతర వాహనాలు రాకపోకలు సాగేలా చేశారు.

రూ.1.10 కోట్లతో డైవర్షన్ రోడ్డు

బీఎన్ రోడ్డులో వాహనాల రద్దీ ఎక్కువగా ఉంటుంది. కూలిన ఇరుకు వంతెనపై నుంచి ప్రయాణించేటప్పుడు వాహనచోదకులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకోవలసి వస్తోంది. దీంతో ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా ఉండేందుకు డైవర్షన్ రోడ్డు ఏర్పాటుకు ప్రభుత్వం రూ.1.10 కోట్లు మంజూరు చేసింది. వడ్డాది విద్యుత్‌శాఖ ఏడీ కార్యాలయం ముందు ఉన్న శివాలయం వద్ద నుంచి పెద్దేరు వంతెన అవతలి వైపు ఉన్న ఆంజనేయస్వామి ఆలయం ముందు నుంచి డైవర్షన్ రోడ్డు ఏర్పాటుకు అధికారులు చర్యలు చేపట్టారు. ఆదివారం ఈ పనులు ప్రారంభించారు. సుమారు 180 అడుగుల పొడవున పెద్దేరు నదిలోంచి 105 సిమెంట్ కల్వర్టు పైపులు వేసి 23 అడుగుల వెడల్పుతో డైవర్షన్ రోడ్డు ఏర్పాటుకు చర్యలు చేపట్టారు. నెల రోజుల్లో పనులు పూర్తి చేయనున్నారు. కూలిన వంతెనను పూర్తిగా తొలగించి, అదే ప్రదేశంలో కొత్తగా వంతెన నిర్మాణానికి రూ.25 కోట్లతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్టు ఆర్అండ్‌బీ జేఈ సాయి శ్రీనివాస్ తెలిపారు.

రాగులపై ఫోకస్!

● చిరుధాన్యాల సంవత్సరంలో జిల్లాలో వీటికి ప్రాధాన్యత
● మద్దతు ధర ప్రకటనతో రైతుల్లో ఆసక్తి పెరిగే అవకాశం
● వచ్చే ఖరీఫ్‌లో మరిన్ని 'చిరు' పంటల సాగుకు ఆస్కారం



రాగుల పంట

సాక్షి, విశాఖపట్నం: అంతర్జాతీయ చిరుధాన్యాల సంవత్సరంగా 2023ని ప్రకటించిన నేపథ్యంలో ఒక్కో జిల్లాలో ఒక్కో చిరుధాన్యం పంట సాగుపై ఫోకస్ పెట్టారు. ఇందులోభాగంగా విశాఖపట్నం జిల్లాలో రాగుల సాగుకు ప్రాధాన్యమివ్వాలని నిర్ణయించారు. ఈ జిల్లాలో రబీ సీజనులో రాగుల సాధారణ విస్తీర్ణం 625 ఎకరాలుంది. ఇప్పటివరకు 500 ఎకరాల్లో రాగుల సాగయింది. త్వరలో మరికొంత విస్తీర్ణం పెరిగే అవకాశం ఉంది. చిరుధాన్యాల సంవత్సరంలో సాగు చేసే ఈ మిల్లెట్స్‌కు ప్రభుత్వం ప్రోత్సాహకాలిస్తుంది. ఇందుకోసం క్లస్టర్లను ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. ఒక్కో క్లస్టరులో 250 ఎకరాలు అవసరమవుతుంది. విశాఖ జిల్లాలో ఇంత పెద్ద మొత్తంలో రాగుల సాగుకు అనువైన భూమి లభ్యత లేదు. జిల్లాలోని గ్రామీణ ప్రాంతంలో పెందుర్తి, భీమిలి, ఆనందపురం, పద్మనాభం మండలాలున్నాయి. వీటిలో ఒక్క పద్మనాభం మండలంలోనే వ్యవసాయ భూములు అధికంగా ఉన్నాయి. మిగిలిన మండలాల్లో పట్టణీకరణతో సాగు భూముల విస్తీర్ణం తగ్గుతూ వస్తోంది. దీంతో వ్యవసాయ శాఖ అధికారులు పద్మనాభం మండలం బాందేవపురాన్ని రాగుల సాగు క్లస్టర్‌గా ఎంపిక చేశారు. అక్కడ కనీసం వంద ఎకరాల్లో రాగుల సాగుకు ఏర్పాట్లు చేస్తున్నారు. పండించిన రాగులను ధాన్యం మాదిరిగానే పౌరసరఫరాల శాఖ అధికారులు కొనుగోలు చేయనున్నారు. అంతేకాదు.. అంగన్వాడీ కేంద్రాలు, చౌకధరల దుకాణాలకు వీటిని సరఫరా చేస్తారు. అందువల్ల రైతులకు మార్కెట్‌కు తరలించి అమ్ముకోవలసిన అవసరం, అవస్థలు ఉండవు. వచ్చే ఖరీఫ్‌లో మరిన్ని చిరుధాన్యాల పంటల సాగును పెంచేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

మద్దతు ధర రూ.3,500

రాగులకు 2023-24 ఆర్థిక సంవత్సరంలో రాగులకు కనీస మద్దతు (ఎంఎస్‌పీ) ధర క్వింటాలుకు రూ.3,500గా ప్రకటించారు. గతంకంటే కనీస మద్దతు ధర పెరగడం వల్ల రైతులకు లాభదాయకంగా ఉండనుంది. రాగుల సాగును పెంచేందుకు పెట్టుబడి రాయితీనిచ్చి ప్రోత్సహిస్తోంది. ఇన్‌పుట్స్ సబ్సిడీ కింద హెక్టారుకు రూ.6 వేల విలువైన విత్తనాలు, పురుగు మందులు, పొటాష్ వంటివి ఇస్తుంది. ఇవన్నీ రాగుల సాగు విస్తీర్ణం పెరగడానికి దోహద పడనున్నాయి. రాగుల సాగు క్లస్టర్‌గా ఎంపికైన పద్మనాభం మండలం బాందేవపురంలో సోమవారం వ్యవసాయ శాఖ అధికారులు అవగాహనా కార్యక్రమం చేపట్టారు.

రాగులతో ప్రయోజనాలివీ..

రాగుల్లో కాల్షియం, ఐరన్, ఫైబర్, ప్రొటీన్లతో పాటు తక్కువ కొవ్వు, బరువు తగ్గించే గుణం, ఎముకల పటిష్టత పెంపు, బ్లడ్ కొలెస్ట్రాల్, రక్తహీనత, మధుమేహాలను నియంత్రించే గుణం వంటివి ఉన్నాయి.

ఎన్నికల యుద్ధానికి సమాయత్తం కావాలి



హాజరైన కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లు



సమావేశంలో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ

ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ

నర్సీపట్నం: గృహ సారథులే వైఎస్సార్‌సీపీ గెలుపు సారథులని ప్రభుత్వ విప్, పార్టీ జిల్లా అధ్యక్షుడు కరణం ధర్మశ్రీ అన్నారు. పట్టణంలోని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన మున్సిపాలిటీ గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు, వలంటీర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల యుద్ధానికి సమాయత్తం కావాలన్నారు. ఎంత మంది ఏకమైనా వైఎస్సార్‌సీపీ విజయాన్ని ఆపలేరన్నారు. గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు, జేసీఎస్ ఇన్‌చార్జిలు సమష్టిగా పని చేయాలన్నారు. టీడీపీ ప్రభుత్వంలో జగన్‌మోహన్ రెడ్డిని అడ్డుకోవాలని చూశారన్నారు. జగన్‌మోహన్ రెడ్డి పాదయాత్రకు శ్రీకారం చుడితే వేలాది మంది ఆయన వెంట నడిచారన్నారు. చంద్రబాబు కొడుకు లోకేష్ పాదయాత్రకు పట్టుమని పది మంది కూడా రావడం లేదని ఎద్దేవా చేశారు.

అనంతరం ఎమ్మెల్యే గణేష్ మాట్లాడుతూ కన్వీనర్లు, గృహసారథులు సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి రెండు కళ్లు అని అభివర్ణించారు. సీఎం నమ్మకాన్ని నిలబెట్టే విధంగా పని చేయాలన్నారు. టీడీపీ హయాంలో ఏ గ్రామం వెళ్లినా ప్రజలు నిలదీసేవారన్నారు. జగనన్న ప్రభుత్వంలో ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారన్నారు. మంత్రిగా ఉండి అయ్యన్నపాత్రుడు చేయలేని పనిని మన ప్రభుత్వం అధికారంలోకి రాగానే మున్సిపాలిటీలో 25 శాతం పన్నులు తగ్గించామన్నారు. రూ.166 కోట్లతో భారీ తాగునీటి ప్రాజెక్టు నిర్మాణం చేపట్టి ఇంటింటికీ కుళాయి ఇచ్చే కార్యక్రమం జరుగుతుందన్నారు. కొన్నేళ్లుగా విస్తరణకు నోచుకోని మెయిన్ రోడ్డును రూ.16.60 కోట్లతో విస్తరిస్తున్నామన్నారు. నియోజకవర్గానికి రూ.500 కోట్లతో మెడికల్ కళాశాల, రూ.470 కోట్లతో తాండవ-ఏలేరు ఎత్తిపోతల పథకం తీసుకు వచ్చామన్నారు. వీటిన్నింటిని ప్రజల్లోకి తీసుకు వెళ్ళాలన్నారు. అనంతరం సీనియర్ నాయకులు చింతకాయల సన్యాసిపాత్రుడు, మున్సిపల్ చైర్‌పర్సన్ గుడబండి ఆదిలక్ష్మి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో వైస్‌చైర్మన్లు గొలుసు నర్సింహమూర్తి, తమరాన అప్పలనాయుడు, పట్టణ పార్టీ అధ్యక్షుడు ఏకా శివ, వార్డు సచివాలయాల కన్వీనర్ తమరాన శ్రీను, వివిధ కార్పొరేషన్ల డైరెక్టర్లు షేక్ ఉన్నీషా బేగం, కర్రి శ్రీనివాసరావు, అర్జున్ వెంకట్రావు, కోనేటి రామకృష్ణ, కౌన్సిలర్లు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

వైభవంగా మహా గాయత్రీ హోమం


మహా గాయత్రీ హోమంలో పాల్గొన్న మహిళలు


హోమానికి హాజరైన ఎంపీ సత్యవతి దంపతులు

పాల్గొన్న ఎంపీ సత్యవతి దంపతులు

అనకాపల్లి రూరల్: లోకకల్యాణ సంకల్పంతో మండలంలోని తుమ్మపాలలో ఆదివారం శ్రీ మహా గాయత్రీ హోమం నిర్వహించారు. మాఘపౌర్ణమిని పురస్కరించుకుని స్థానిక సుగర్ ఫ్యాక్టరీ ఆవరణలో నిర్వహించిన హోమంలో 555 మంది మహిళలు పాల్గొని భక్తి శ్రద్ధలతో క్రతువు నిర్వహించారు. హోమాల అనంతరం పూర్ణాహుతి ఇచ్చారు. ఈ కార్యక్రమానికి అనకాపల్లి ఎంపీ భీశెట్టి సత్యవతి దంపతులు హాజరయ్యారు. ఇలాంటి కార్యక్రమాల ద్వారా ప్రజల్లో ఆధ్యాత్మిక భావన, సమాజ హిత లక్షణాలు అలవడతాయని ఎంపీ అభిప్రాయపడ్డారు. ఇలాంటి మంచి కార్యక్రమాలు ఏర్పాటు చేసిన గ్రామ పెద్దల్ని ఎంపీ అభినందించారు. హోమాన్ని తిలకించేందుకు స్థానికులు అధిక సంఖ్యలో చక్కెర కర్మాగారం ప్రాంగణానికి రావడంతో అక్కడ కోలాహల వాతావరణం నెలకొంది. కార్యక్రమంలో తుమ్మపాల మాజీ సర్పంచ్ కర్రి బాబీ, ఎంపీటీసీ చదరం నాగేశ్వరరావు, పీలా విశ్వేశ్వరరావు, పంచాయతీ వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ప్రభుత్వ కళాశాలలో ప్రైవేట్ ప్రచారం


ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రధాన ద్వారానికి కట్టిన శ్రీప్రకాష్ సంస్థల బ్యానర్

యలమంచిలి : ప్రభుత్వ కళాశాలల్లో ప్రవేశాలను పెంచేందుకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది. అయితే ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల నుంచి వచ్చే నజరానాలకు ఆశపడి ఏకంగా ప్రభుత్వ కళాశాల భవనాన్ని ప్రైవేటు కళాశాల ప్రచార కార్యక్రమానికి అప్పగించడం గమనార్హం. ఆదివారం యలమంచిలి గురజాడ అప్పారావు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జరిగిన పాయకరావుపేట శ్రీప్రకాష్ విద్యాసంస్థల అడ్మిషన్ల ప్రచార కార్యక్రమమే ఇందుకు నిదర్శనం. పట్టణంలోని వివిధ పాఠశాలలకు చెందిన టెన్త్ విద్యార్థులకు ఇక్కడ అడ్మిషన్ టెస్టు, అనంతరం తల్లిదండ్రులతో సమావేశాన్ని సదరు సంస్థ నిర్వహించింది. ఈ విషయం బయట పడితే కప్పిపుచ్చుకునేందుకు ముందుగానే ప్రభుత్వ డిగ్రీ కళాశాల జవహర్ నాలెడ్జ్ కేంద్రం(జేకేసీ)సమావేశంగా చెప్పుకునేందుకు ఆ బ్యానర్ పెట్టి కొన్ని ఫొటోలు తీయించిన తర్వాత శ్రీ ప్రకాష్ సంస్థల కార్యక్రమాన్ని ధీమాగా నిర్వహించుకున్నారు. దీనిపై కళాశాల ప్రిన్సిపాల్ పి.చంద్రశేఖర్‌ను వివరణ కోరగా.. అది జేకేసీ కార్యక్రమమేనన్నారు. అక్కడ ప్రైవేట్ విద్యా సంస్థ అడ్మిషన్ల కోసం ప్రచారం నిర్వహించిన విషయం తనకు తెలియదని పేర్కొన్నారు.

54 కేజీల గంజాయి పట్టివేత


స్వాధీనం చేసుకున్న గంజాయి

పాయకరావుపేట : నామవరం గ్రామం వద్ద జాతీయ రహదారిపై 54 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్టు ఎస్‌ఐ బి.జోగారావు తెలిపారు. విశాఖపట్నం నుంచి తుని వైపు వెళ్తున్న అశోక్ లేలాండ్ గూడ్స్ వాహనంలో ఇద్దరు వ్యక్తులు 54 కేజీల గంజాయి ప్యాకెట్లతో పట్టుబడ్డారన్నారు. కర్ణాటక రాష్ట్రానికి చెందిన మజార్ పాష, తమిళనాడు రాష్ట్రానికి చెందిన అరవిందస్వామి గంజాయి తరలిస్తుండగా అదుపులోనికి తీసుకుని, కేసు నమోదు చేసి ఇద్దరినీ రిమాండ్‌కు తరలించినట్టు ఎస్‌ఐ జోగారావు తెలిపారు.

మాఘ పున్నమి వేళ.. భక్త జనహేల

కార్తీకమాసంలో దీపానికెంత ప్రాశస్త్యం ఉందో... మాఘమాసంలో స్నానానికి కూడా అంతే ప్రాశస్త్యం. హిందూ మత విశ్వాసాల ప్రకారం మాఘ పూర్ణిమ రోజున పుణ్య నదులు, సముద్రంలో స్నానం చేయడం.. దానం చేయడం వల్ల సకల శుభాలు కలుగుతాయని భక్తుల విశ్వాసం. ఆదివారంనాటి మాఘ పౌర్ణమిన రవి పుష్యయోగంతో పాటు, ఎన్నో శుభ యోగాలున్నాయి. ఈ శుభ యోగంలోనే రాముడు జన్మించాడని ప్రతీతి. ఆదిశక్తి రూపాలైన త్రిపురాత్రయంలో ద్వితీయ స్వరూపం, శ్రీచక్రానికి అధిష్ఠాన దేవత అయిన శ్రీలలితా త్రిపురసుందరి భండాసురుణ్ణి వధించడానికి మాఘ పౌర్ణమిరోజునే ఆవిర్భవించినట్టు పురాణాలు చెప్తున్నాయి. అందుకే ఈ మహా మాఘి రోజున భక్తులు సముద్ర, నదీ స్నానాలు, దానాలు, ప్రత్యేక పూజలతో భక్తిపారవశ్యంలో మునిగితేలారు.

- మాఘ పౌర్ణమి సందర్భంగా కిక్కిరిసిన సముద్ర తీరం
- పితృదేవతలకు తర్పణాలు, దానాలు చేసిన భక్తజనం


భక్తుల సేవలో ఉచిత వైద్య శిబిరం

ఎస్.రాయవరం: మాఘ పౌర్ణమి/మహా మాఘి సందర్భంగా తీరప్రాంతాల్లో భక్తులు పోటెత్తారు. 'దుఃఖ దారిద్ర్యనాశాయ శ్రీ విష్ణోస్తోషణాయచ ప్రాతః స్నానం కరోమ్యద్య మాఘే పాపవినాశనం'అనే శ్లోకాన్ని పఠిస్తూ.. ఆచార సంప్రదాయాలతో పుణ్యస్నానం ఆచరించారు. దంపతులు బ్రహ్మముడులు వేసుకుని, వేద పండితుల మంత్రోచ్చరణల మధ్య సముద్ర స్నానాలు చేసి పూజలు నిర్వహించారు. తమ పితృదేవతల పేరిట తర్పణాలు వదిలారు. బ్రాహ్మణులకు, పండితులకు, అభాగ్యులకు దానాలిచ్చారు.

రేవుపోలవరం.. పోటెత్తిన భక్తజనం


రేవుపోలవరం తీరంలో పుణ్య స్నానాలు ఆచరిస్తున్న భక్తులు

రేవుపోలవరం తీరంలో మాఘపౌర్ణమి పుణ్య స్నానాలకు ఆదివారం భక్తులు పోటెత్తారు. అధిక సంఖ్యలో భక్తులు సూర్యోదయం నుంచే తీరానికి తరలిరావడంతో మార్గాలు కిక్కిరిశాయి. లక్షకు పైగా భక్తులు వచ్చి ఉంటారని ఉత్సవ కమిటీ, అధికారులు, పోలీస్ సిబ్బంది చెబుతున్నారు. ఏటా మాదిరే ఏర్పాట్లు చేసినప్పటికీ.. గతం కంటే చాలా ఎక్కువగా జనాలు పోటెత్తడంతో తీరం జనసంద్రమయింది. ఈ జాతర వీకెండ్‌లో రావడతో యువత, చిన్నారుల కేరింతలతో సందడి మరింతగా పెరిగింది. స్నానమాచరించిన భక్తులు తీరంలో కొలువుదీరిన శ్రీ లక్ష్మీమాధవ స్వామిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

ముమ్మర పర్యవేక్షణ

నర్సీపట్నం డీఎస్పీ ప్రవీణ్‌కుమార్, నక్కపల్లి సీఐ నారాయణరావు పర్యవేక్షణలో ఎస్.రాయవరం ఎస్‌ఐ ప్రసాదరావు బందోబస్తు ఏర్పాట్లు చేశారు. సాయిమెరైన్ వద్ద కాసేపు ట్రాఫిక్ సమస్య తలెత్తినప్పటికీ పోలీస్, ఆర్టీసీ సిబ్బంది సమన్వయంతో త్వరితగతిన ట్రాఫిక్ ఇక్కట్లను తొలగించారు. భక్తుల రాకపోకలకు ఇబ్బంది లేకుండా చూశారు. నర్సీపట్నం ప్రజారవాణా డిపో వారు భక్తుల రాకపోకలకు వీలుగా 36 ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేశారు. సొంత వాహనాలు, ద్విచక్ర వాహనాల్లో వచ్చేవారితో రోడ్లు కిక్కిరిసిపోయాయి.

సేవాతత్పరులు

రేవుపోలవరం తీరంలో ప్రతీ మాఘపౌర్ణమికి సత్యసాయి సేవాసంఘం భక్తులు ఉచిత సేవలు అందిస్తూ వారి సేవాతత్పరతను చాటుకుంటారు. ఈ ఏడాది కూడా జాతరకు తరలివచ్చిన భక్తులకు మజ్జిగ, తాగునీరు అందించడం, పాదరక్షలు భద్రపరచడం, సముద్రస్నానమాచరించిన స్త్రీలు వస్త్రాలు మార్చుకునేందుకు తాత్కాలిక మరుగుదొడ్ల ఏర్పాటు వంటి సేవాకార్యక్రమాలు చేపట్టారు. మాఘపౌర్ణమికి సేవలు ప్రారంభించి ఈ ఏడాదితో 20 ఏళ్లు పూర్తయినట్టు సేవాసంఘం ప్రతినిధులు ఆనందం వ్యక్తం చేశారు. మండల పరిషత్ సిబ్బంది, సచివాలయ సిబ్బంది భక్తులకు సహాయ సహకారాలు అందించారు. ఎంపీడీవో రామచంద్రమూర్తి, ఈవోపీఆర్డీ సత్యనారాయణ జాతర వద్ద ఏర్పాట్లు పర్యవేక్షించారు. పెనుగొల్లు పీహెచ్‌సీ సిబ్బంది ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేసి జాతరలో అవసరమైనవారికి వైద్యసేవలు అందించారు. అలాగే జాతర మార్గంలో లక్ష్మీపతిరాజుపేట, అడ్డురోడ్డు, కొరుప్రోలు తదితర ప్రాంతాల్లో అల్పాహారం, తాగునీరు, మజ్జిగ పంపిణీ చేశారు. అడ్డురోడ్డులో మాజీ ఎమ్మెల్యే చెంగల వెంకట్రావు చేతులు మీదుగా పులిహోరా పంపిణీ చేశారు. దీంతో జాతర ప్రశాంత వాతావరణంలో ముగిసింది.


లక్ష్మీ మాధవ స్వామిని దర్శించుకునేందుకు బారులు తీరిన భక్తులు


జాతర భక్తులకు తాగునీరు, మజ్జిగ అందిస్తున్న సత్యసాయి సేవా సంఘం సభ్యులు

పూడిమడకకు పోటెత్తిన భక్తులు

అచ్యుతాపురం(అనకాపల్లి): అనకాపల్లి జిల్లాలోని ప్రధాన తీర ప్రాంతాల్లో ఒకటైన పూడిమడకలో ఆదివారం ఉదయం భక్తులు పుణ్య స్నానాలు ఆచరించారు. మాఘ పౌర్ణమి జాతరలో భాగంగా తెల్లవారుజాము నుంచే భక్తులు సముద్రానికి భారీగా పోటెత్తారు. జాతరలో సందడి చేశారు. సముద్ర తీరాన ఏర్పాటు చేసిన స్టాల్స్, సాంస్కృతిక కార్యక్రమాలు తిలకించారు. పుణ్య స్నానాలు ఆచరించిన భక్తులు జగన్నాథ స్వామిని కొలిచారు. జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి విచ్చేసిన మత్స్యకార బంధువులు, భక్తులు, స్థానికులతో సాగరం హోరెత్తింది. భక్తులు స్నానాలు ఆచరించిన తర్వాత దుస్తులు మార్చుకునేందుకు అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. చిన్నారులు రంగుల రాట్నాలు తిరిగి ఉత్సాహంగా గడిపారు. తీరంలో స్నానం చేసిన భక్తులు లోపలికి వెళ్లకుండా స్థానిక పోలీసులు, మెరైన్ పోలీసులు పకడ్బందీ ఏర్పాట్లు చేశారు. హైస్కూల్ జంక్షన్ నుంచి భక్తుల వాహనాలను అనుమతించలేదు. అనకాపల్లి నుంచి ఆర్టీసీ బస్సు సర్వీసులను అదనంగా నడిపారు.



పూడిమడక తీరంలో భక్తుల సందడి

కంచి పీఠాధిపతిని దర్శించుకున్న మంత్రి అమర్‌నాథ్


విజయేంద్ర సరస్వతిని దర్శించుకున్న మంత్రి అమర్‌నాథ్

సీతంపేట: శంకరమఠంలో విడిది చేసియున్న కంచి కామకోటి పీఠాధిపతి శ్రీ శంకర విజయేంద్ర సరస్వతిని రాష్ట్ర పరిశ్రమల శాఖామంత్రి గుడివాడ అమర్‌నాథ్ ఆదివారం దర్శించారు. ఈ సందర్భంగా పలు అంశాలపై స్వామివారు, అమర్‌నాథ్ చర్చించుకున్నారు. అనంతరం విజయేంద్ర సరస్వతి పలు విలువైన పుస్తకాలను అమర్‌నాథ్‌కు అందజేశారు. మంత్రి వెంట వైఎస్సార్ సీపీ ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు, ఫ్లోర్ లీడర్ బాణాల శ్రీనివాసరావు, శంకరమఠం అధ్యక్షుడు డాక్టర్ రవిరాజు ఉన్నారు.

ముస్లింలకు రాజకీయ ప్రాధాన్యం కల్పించాలి


మాట్లాడుతున్న నసీరుద్దీన్

దాబాగార్డెన్స్: ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా, ఉత్తరాంధ్ర జిల్లాల్లో ముస్లింలకు అన్ని రాజకీయ పార్టీలు ప్రాధాన్యం కల్పించాలని ముస్లిం రాజకీయ చైతన్య వేదిక డిమాండ్ చేసింది. వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం వేదిక రాష్ట్ర కన్వీనర్ నసీరుద్దీన్ విలేకరులతో మాట్లాడారు. కోస్తాంధ్రలో 25 ఏళ్లుగా ఒక్క ముస్లిం ప్రజాప్రతినిధి కూడా లేడని.. 30 ఏళ్ల కిందట కాకినాడ నుంచి కాంగ్రెస్ ఓ ముస్లిం లాయర్‌కి సీటు ఇచ్చిందని గుర్తు చేశారు. అప్పట్లో ఆయన రెండవ స్థానంలో నిలిచారన్నారు. 28 ఏళ్ల కిందట వైజాగ్‌లో ముస్లిం ఎమ్మెల్యేను గెలిపించారన్నారు. ఆ తర్వాత స్థానిక సంస్థల ఎన్నికల్లో మినహా శాసనసభ, పార్లమెంట్‌కు అవకాశం లేకుండా అన్ని పార్టీలు విస్మరించాయన్నారు. అన్ని పార్టీలు ముస్లిం నాయకత్వాన్ని చట్ట సభలకు దూరం చేస్తున్నాయని విమర్శించారు. ఏ పార్టీ అయితే రాష్ట్రంలో ఎక్కువ శాతం ముస్లింలకు ప్రాధాన్యం కల్పిస్తుందో.. ఆ పార్టీని గెలిపించుకునేందుకు ముస్లిం రాజకీయ చైతన్య వేదిక కృషి చేస్తుందన్నారు. సమావేశంలో షేక్ సలీం, ఎండీ హనీఫ్, ఇమ్రాన్ హుస్సేన్, జహంగీర్, షరీఫ్, వల్లీ పాల్గొన్నారు.

బ్యాడ్మింటన్ స్టేట్ చాంపియన్‌గా ఉషశ్రీ


ద్వారకానాథ్ చేతుల మీదుగా చాంపియన్ ట్రోఫీ అందుకుంటున్న కార్పొరేటర్ ఉషశ్రీ

సీతంపేట: జీవీఎంసీ 43వ వార్డు కార్పొరేటర్ పెద్దిశెట్టి ఉషశ్రీ బ్యాడ్మింటన్‌లో స్టేట్ చాంపియన్‌గా నిలిచారు. బాడ్మింటన్ అసోసియేషన్ ఆఫ్ వైఎస్సార్ కడప ఆధ్వర్యంలో ప్రొద్దుటూరు ఇండోర్ స్టేడియంలో ఈ నెల 2 నుంచి 5వ తేదీ వరకు ఏపీ స్టేట్ మాస్టర్స్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో రాష్ట్రంలోని 26 జిల్లాల నుంచి క్రీడాకారులు పాల్గొన్నారు. 45 ప్లస్ కేటగిరీలో సింగిల్స్, మిక్స్‌డ్ డబుల్స్‌లో ఉషశ్రీ రెండు టైటిల్స్ గెలుపొందారు. బ్యాడ్మింటన్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ద్వారకానాథ్ చేతుల మీదుగా ట్రోఫీలు అందుకున్నారు. రాష్ట్రస్థాయి చాంపియన్ షిప్‌ను గెలుచుకున్న ఉషశ్రీ మార్చి 19 నుంచి గోవాలో జరగనున్న నేషనల్ చాంపియన్‌షిప్‌లో రాష్ట్రానికి ప్రాతినిధ్యం వహిస్తారు. నేషనల్స్‌లో గెలుపొంది ఇంటర్నేషనల్ టైటిల్ సాధించడమే తన లక్ష్యమని ఆమె తెలిపారు. ఆమెను పలువురు అభినందించారు.

శ్లాబ్ కూలి వ్యక్తి మృతి

అనకాపల్లిటౌన్ : స్థానిక నాయుళ్లవీధికి చెందిన పట్నాల శ్రీను(48) శ్లాబ్ కూలి ఆదివారం మృతి చెందాడు. పట్టణ ఎస్‌ఐ సత్యనారాయణ అందించిన వివరాలిలా ఉన్నాయి. శ్రీను వడ్రంగి పని చేసుకుంటూ భార్య లక్ష్మి, ఇద్దరు పిల్లలతో జీవనం సాగిస్తున్నాడు. లక్ష్మీదేవిపేటకు చెందిన ఎం.సత్యారావు తన గృహంలో విద్యుత్‌వైర్లకు చెట్టుకొమ్మలు తగులుతూ విద్యుత్‌కు అంతరాయం ఏర్పడుతోందని తెలపడంతో చెట్ల కొమ్మలు తొలగించడానికి ఆదివారం ఉదయం అతని ఇంటికి శ్రీను వెళ్లాడు. శిథిలావస్థకు చేరుకున్న శ్లాబ్‌పైకి ఎక్కి చెట్టుకొమ్మలు తొలగిస్తుండగా ఒక్కసారిగా శ్లాబ్ కూలిపోవడంతో శ్రీను అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటనపై మృతుని భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ చెప్పారు.

మాకు దిక్కెవరంటూ విలపించిన భార్య, పిల్లలు

భర్త విగతజీవిగా మారడంతో ఇద్దరు చిన్నారులతో తానెలా జీవించేదంటూ ఆమె గుండెలవిసేలా రోధించింది. భర్త మృతితో సర్వం కోల్పోయిన లక్ష్మి రోదన చూపరులను కంటతడి పెట్టించింది.

వైభవంగా వసంతోత్సవం


శ్రీ కేశవస్వామివారి నాగవల్లి వసంతోత్సవం జరుపుతున్న అర్చకులు

చోడవరం: కల్యాణోత్సవాల్లో భాగంగా కేశవస్వామి వారికి నాగవల్లి వసంతోత్సవం కనుల పండువగా ఆదివారం జరిగింది. చోడవరంలో వేంచేసిన శ్రీదేవి, భూదేవి సమేత కేశవస్వామివారి 750వ వార్షిక బ్రహ్మోత్సవాలు ఐదు రోజులుగా ఘనంగా జరుగుతున్నాయి. స్వామివారి కల్యాణంలో భాగంగా శ్రీచక్రస్నానం నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు సీతారామాచార్యులు ఆధ్వర్యంలో వేదపండితుల మంత్రోచ్చరణల మధ్య స్వామివారి వసంతోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. ఉదయం నుంచీ స్వామివారికి ప్రత్యేక పూజలు జరిపారు. శ్రీదేవి, భూదేవి, కేశవస్వామివారి ఉత్సవ మూర్తులను ప్రత్యేకంగా అలంకరించిన మండపంలో ఉంచి వసంతోత్సవం జరిపారు. ప్రత్యేక అభిషేకాలు, మహా పూర్ణాహుతి జరిపించారు. సాయంత్రం అన్నమాచార్య, పురంధరదాస సంకీర్తనాలాపన కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు పప్పల జయదేవ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ ఉత్సవాల్లో దేవదాయ శాఖ ఈవో సత్యనారాయణమూర్తి పాల్గొన్నారు.

ఘనంగా ముగిసిన ఉమామహేశ్వరి దేవి తీర్థం


కబడ్డీ పోటీలో విజేతగా నిలిచిన విశాఖ జట్టుకు నగదు బహుమతిని అందిస్తున్న మాజీ ఎంపీపీ భాస్కరరావు

దేవరాపల్లి: మండలం కేంద్రం దేవరాపల్లిలో నిర్వహిస్తున్న ఉమామహేశ్వరీ దేవి కల్యాణ(తీర్థ) మహోత్సవాలు ఆదివారంతో ఘనంగా ముగిశాయి. ఈ సందర్భంగా జరిగిన జిల్లా స్థాయి ఎడ్ల బళ్ల పోటీలు హోరా హోరీగా సాగాయి. ఈ పోటీల్లో చుక్కపల్లి మజ్జి రాజేష్‌కి చెందిన రెండు జతల ఎడ్లు ప్రథమ, తృతీయ స్థానాల్లో నిలిచాయి. ద్వితీయ స్థానంలో గరిశింగికి చెందిన పరవాడ గోవింద, నాలుగు, ఐదుస్థానాల్లో చుక్కపల్లికి చెందిన అద్దేపల్లి పాలవెళ్లి ఎడ్లు నిలిచాయి. వీరికి వరుసగా 25వేలు, 20వేలు, 15వేలు, రూ.10 వేలు, రూ.6వేల చొప్పున నగదు బహుమతులను ఎంపీపీ కిలపర్తి రాజేశ్వరి, మాజీ ఎంపీపీ కిలపర్తి భాస్కరరావు, ఉత్సవ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దల చేతులు మీదుగా అందజేశారు.

జిల్లా స్థాయి మహిళా కబడ్డీ విజేత విశాఖ

తీర్థం సందర్భంగా నిర్వహించిన జిల్లా స్థాయి మహిళా కబడ్డీ పోటీల విజేతగా విశాఖపట్నం జట్టు నిలిచింది. స్థానిక టీటీడీ కల్యాణ మండపం ఆవరణలో శనివారం అర్ధరాత్రి వరకు నిర్వహించిన పోటీల్లో ఉమ్మడి, విశాఖ, విజయనగరం జిల్లాల నుంచి పది జట్లు పాల్గొన్నాయి. ఈ పోటీల్లో ద్వితీయ స్థానంలో విజయనగరం, తృతీయ స్థానంలో చంద్రంపాలెం, నాల్గువ స్థానంలో దేవరాపల్లి జట్లు నిలిచాయి. వీరికి రూ.10వేలు, రూ.8వేలు, రూ.6వేలు, రూ.4వేలు చొప్పున నగదు బహుమతులను దాతలు, ఉత్సవ కమిటీ సమక్షంలో ఎంపీపీ కిలపర్తి రాజేశ్వరి, మాజీ ఎంపీపీ కిలపర్తి భాస్కరరావు చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా తెల్లవారజాము నుంచి వేలాదిగా దేవితల్లిని దర్శించుకొని భక్తిశ్రద్ధలతో పూజలు జరిపారు. అనంతరం రాత్రి పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరి మృతి


మృతి చెందిన రావాడ ఎర్రేసు


మృతిచెందిన వమ్మవరం చిననూకులు (ఫైల్)

ఎస్.రాయవరం : గుర్రాజుపేట రోడ్డు సమీపంలో రేవుపోలవరం ఆర్‌అండ్‌బీ రోడ్డుపై టీవీఎస్ మోపెడ్‌పై ఆగి ఉన్నవారిని, పల్సర్ బైకు వేగంగా వచ్చి ఢీకొట్టడంతో ఇద్దరు వ్యక్తులు మృతి చెందినట్టు ఎస్‌ఐ ప్రసాద్‌రావు తెలిపారు. శనివారం అర్ధరాత్రి జరిగిన ఈ ప్రమాదానికి సంబంధించి ఎస్‌ఐ అందించిన వివరాలిలా ఉన్నాయి. కోటఉరట్ల మండలం పాత తంగేడు గ్రామానికి చెందిన పెదపూడి కళ్యాణం, రావాడ ఎర్రేసు అలియాస్ చంటిలు మోపెడ్ బండిపై రేవుపోలవరం జాతరకు వస్తూ మార్గమధ్యంలో గుర్రాజుపేట రోడ్డు సమీపంలో ఆగారు. వారి వెంట వస్తున్న వమ్మవరం గ్రామానికి చెందిన కుందూరు చిననూకులు, కూరపాటి శ్రీను పల్సర్ బైకుపై వేగంగా వచ్చి ఢీకొట్టడంతో ఈ ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో పారిశుధ్య కార్మికుడిగా పనిచేస్తున్న పాత తంగేడు గ్రామానికి చెందిన రావాడ ఎర్రేసు (41) అక్కడికక్కడే మృతిచెందగా, వమ్మవరం గ్రామానికి చెందిన యువకుడు కుందూరు చిననూకులు(20) అనకాపల్లి ఆస్పత్రిలో మృతిచెందినట్టు చెప్పారు. ఈ ప్రమాదంలో వమ్మవరం బైకుపై ఉన్న కూరపాటి శ్రీను, పాత తంగేడు గ్రామానికి చెందిన పెదపూడి కళ్యాణం స్వల్ప గాయాలతో చికిత్స తీసుకుని ఇంటికి వెళ్లారు. వివరాల మేరకు ఎస్‌ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు చెప్పారు.

క్లుప్తంగా

హిందూ ధర్మ పరిరక్షణకు పాటుపడాలి



హిందూ ధర్మంపై ప్రచారం చేస్తున్న సమరసత సేవా ఫౌండేషన్ సభ్యులు

మునగపాక : ప్రతి ఒక్కరూ హిందూ ధర్మ పరిరక్షణకు పాటుపడాలని సమరసత సేవా ఫౌండేషన్ సబ్ డివిజన్ కన్వీనర్ బీవీ రమణ కోరారు. సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం మునగపాక సంతబయిల రామాలయంలో హిందూ దర్మ ప్రచారంపై కరపత్రాల పంపిణీ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ధర్మాన్ని కాపాడాలన్నారు. అలాగే దేవాలయాలను సందర్శించడం ద్వారా మానసిక ప్రశాంతత దొరుకుతుందన్నారు. కార్యక్రమంలో సబ్ డివిజన్ దర్మ ప్రచారకుడు కొల్లి అప్పారావు, మండల శాఖ అధ్యక్షుడు ఆదారి లక్ష్మణరావు పాల్గొన్నారు.

18న మహా శివరాత్రి వేడుకలు



అభిషేకాల్లోఉమారామలింగేశ్వరుడు

అనకాపల్లిటౌన్ : స్థానిక ఉమా రామలింగేశ్వ రాలయంలో ఈ నెల 18న మహా శివరాత్రి సందర్భంగా ఘనంగా వేడుకలు నిర్వహించనున్నట్టు ఆలయ గౌరవ అధ్యక్షుడు బీశెట్టి జగన్ ఆదివారం తెలిపారు. శనిత్రయోదశి కావడంతో ఆలయ ప్రధాన అర్చకులు సాలగ్రామ రఘు ఆధ్వర్యంలో స్వామివారికి రుద్రాభిషేకం, దివ్య కల్యాణమహోత్సవం జరపనున్నట్టు పేర్కొన్నారు.

బీమా వర్తింపునకు పేర్ల నమోదు తప్పనిసరి

కశింకోట : వైఎస్సార్ బీమా పథకంలో భవన నిర్మాణ కార్మికులుగా నమోదు చేసుకున్న వారు తమకు పథకం వర్తించాలంటే కార్మిక శాఖ కార్యాలయంలో తప్పనిసరిగా తమ పేర్లను నమోదు చేసుకోవాలని అసిస్టెంట్‌లేబర్ ఆఫీసర్ కె.బాలకృష్ణ కోరారు. లేదంటే వైఎస్సార్ బీమా వర్తించదని పేర్కొన్నారు. దీని దృష్ట్యా అనకాపల్లి గవరపాలెంలోని కార్మిక శాఖ కార్యాలయానికి వచ్చి భవన నిర్మాణ రంగ కార్మికులు బీమా పథకం వర్తింపునకు వారి పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

బెల్లం ధరలు



అనకాపల్లి మార్కెట్‌కు శనివారం 8,721 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
స్పెషల్	3,800	4,200
మొదటి రకం	3,330	3,680
రెండో రకం	3,120	3,460
మూడో రకం	2,880	3,100

అనకాపల్లి సినిమాలు

మైఖేల్	- రాజా
బుట్ట బొమ్మ	- సత్యనారాయణ స్క్రీన్-1
పఠాన్	- సత్యనారాయణస్క్రీన్-2
రైటర్ పద్మభూషణ్	- షిర్డిసాయి
పఠాన్	- పర్తిసాయి
వీరసింహారెడ్డి	- వెంకటేశ్వర
హంట్	- శ్రీసత్య
వాల్తేరు వీరయ్య	- రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లిటౌన్: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 37 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-12 యూనిట్లు , బీ పాజిటివ్-7 యూనిట్లు, బీ నెగిటివ్-1 యూనిట్, ఓ పాజిటివ్-10 యూనిట్లు, ఓ నెగిటివ్-4 యూనిట్లు, ఏబీ పాజిటివ్-3 యూనిట్ల శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయ బ్లడ్‌బ్యాంకు ప్రతినిధి గంగయ్య(9182834480)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లిటౌన్: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా ఆదివారం 196 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న 512 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ(9441108144)ని సంప్రదించవచ్చు.

సొంతింటి కల.. ఉగాదికి నెరవేరేలా!

- ఐదు గ్రామాలకు ఒకే చోట జగనన్న కాలనీలో ఇళ్లు
- శరవేగంగా తేగాడ జగనన్న లే అవుట్లో నిర్మాణాలు



తేగాడ వద్ద తుది దశలో వైఎస్సార్ జగనన్న ఇళ్లు



నిర్మాణంలో ఉన్న ఇళ్లు



స్తంభాలు వేసి కాలనీకి విద్యుత్ సదుపాయం



అందంగా నిర్మించిన ఇళ్లు

కశింకోట : మండలంలోని తేగాడ వద్ద వైఎస్సార్ జగనన్న గృహనిర్మాణ లే-అవుట్‌లో ఉగాది నాటికి గృహప్రవేశానికి వీలుగా ఇళ్ల నిర్మాణాలు ఊపందుకున్నాయి. ఐదు గ్రామాలకు కలిపి ఒకే చోట గృహ నిర్మాణాలకు స్థలాలు మంజూరు చేశారు. సుమారు 250 మందికి ఇక్కడ ఇళ్ల పట్టాలు ఇచ్చారు. వీటిలో ఇప్పటికే సుమారు 30 ఇళ్ల నిర్మాణం పూర్తయింది. ఓ పది మంది గృహ ప్రవేశాలు కూడా చేశారు. మిగిలిన ఇళ్ల నిర్మాణాలు కూడా శరవేగంగా జరుగుతున్నాయి.

చుట్టూ..ఆహ్లాదకరం

తేగాడ గ్రామం వద్ద కొండను ఆనుకుని ఎక్కువ విస్తీర్ణంలో ప్రభుత్వ భూమి ఉండటంతో జగనన్న లే అవుట్ వేశారు. ప్లాట్లు విభజించారు. తేగాడతో పాటు చుట్టు పక్కల ఉన్న పేరంటాలపాలెం, జోగారావుపేట, కొత్తపల్లి, బుచ్చియ్యపేట గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు ఆయా ప్రాంతాల్లో తగిన ప్రభుత్వ భూమి లేకపోవడంతో ఇక్కడ ఒక టిన్న సెంట్ల చొప్పున ప్లాట్లు కేటాయించారు. జగనన్న గృహ నిర్మాణ పథకంలో ఇళ్ల నిర్మాణం కూడా చేపట్టారు. ఈ లే అవుట్‌ను చూస్తే.. చుట్టూ ఆహ్లాదకర వాతావరణంలో ప్రశాంత జీవనానికి ఆలవాలంగా ఉంటుంది.

మౌలిక వసతుల ఏర్పాటు

కశింకోటలోని వడ్డి వీధిలో వేసిన పెద్ద లే అవుట్ తర్వాత తేగాడ లే అవుట్‌లోనే ఎక్కువ గృహ నిర్మాణాలు జరుగుతున్నాయి. వీటికి ప్రభుత్వం అందిస్తున్న ఇసుక, సిమెంట్, ఐరన్ తదితర నిర్మాణ సామగ్రి, ఆర్థిక సాయంతోపాటు సొంత నిధులతో లబ్ధిదారులతో అందంగా తమ గృహాలు నిర్మించుకుంటున్నారు. వాటికి నీటి సరఫరా కోసం అధికారులు రెండు బోర్లను ఏర్పాటు చేశారు. కుళాయి కనెక్షన్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నారు. అలాగే కాలనీ వీధుల వారీగా విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసి విద్యుత్ సౌకర్యం కల్పించారు. కనీస మౌలిక వసతులైన విద్యుత్, నీటి సరఫరా ఏర్పాటుతో ఎలాంటి ఆటంకాల్లేకుండా భవన నిర్మాణాలు జోరుగా సాగుతున్నాయి.

ఉగాదికి దాదాపు పూర్తి

రానున్న ఉగాదికి వీలైనంత మేరకు శతశాతం గృహ ప్రవేశాలు జరగాలని ప్రభుత్వం లక్ష్యంగా నిర్దేశించింది. ఈ మేరకు ఆదేశాలు అందడంతో మండల స్థాయి అధికారులు, సచివాలయ సిబ్బంది కాలనీల్లో ఇళ్ల నిర్మాణంపై దృష్టి సారించారు. లక్ష్యాన్ని చేరుకోవడానికి లబ్ధిదారులను ఎప్పటికప్పుడు అన్ని విధాలా అధికారులు ప్రోత్సహిస్తున్నారు. దీంతో లబ్ధిదారులు కూడా తమ సొంతింటి కల నెరవేర్చేకునేందుకు ప్రభుత్వ సాయంతో గృహ నిర్మాణాలను వేగవంతం చేస్తున్నారు. ఉగాదికి దాదాపుగా ఇళ్ల నిర్మాణాలు పూర్తవుతాయని అధికారులు భావిస్తున్నారు.

జగనన్నతో తీరిన సొంతింటి కల



మాకు ఇప్పటి వరకు సొంతిల్లు లేదు. అద్దె ఇంట్లో ఉంటూ.. బతుకు వెళ్లదీస్తున్నాం. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి చల్లని చేయూతతో ఇంటి స్థలం మంజూరు చేశారు. ఇల్లు కట్టుకోవడానికి కూడా సాయమందించారు. దీంతోపాటు మాదగ్గరున్న కొంత మొత్తంతో మా కలల ఇంటిని నిర్మించుకుంటున్నాం. నిర్మాణం చివరి దశకు చేరుకుంది. మాక్కూడా సొంతిల్లు ఉంది.. అని గర్వంగా.. ధీమాగా.. చెప్పుకోగలుగుతున్నాం. ఈ ఆనందానికి కారణమని సీఎం జగన్‌కు జీవితాంతం రుణపడి ఉంటాం.

– అల్లం మాణిక్యాలరావు, గృహ లబ్ధిదారుడు, జోగారావుపేట

ఉగాది మా టార్గెట్

ఉగాదికి వైఎస్సార్ జగనన్న కాలనీలో దాదాపు అందరి గృహ ప్రవేశాలు జరిగేలా టార్గెట్ పెట్టుకున్నాం. ఆ మేరకు ఇళ్ల నిర్మాణం పూర్తయ్యేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నాం. ఇంజినీరింగ్ అధికారులు, సచివాలయ ఇంజినీరింగ్ సహాయకులను అప్రమత్తం చేశాం. వారు లబ్ధిదారులతో ఎప్పటికప్పుడు మాట్లాడి నిర్మాణ ప్రగతిని తెలుసుకుంటారు. ప్రభుత్వపరంగా అవసరమైన చర్యలు తీసుకుంటారు. మా ప్రోత్సాహంతో లబ్ధిదారులు కూడా చొరవగా ముందుకు వచ్చి, ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేస్తున్నారు.

– కొంకి అప్పారావు, ఎంపీడీవో, కశింకోట

వైభవంగా మహా మాఘ ఉత్సవాలు



పూజలందుకున్న సహస్రాక్షి రాజరాజేశ్వరీదేవి



ఖడ్గమాల దేవతలను అభిషేకించేందుకు కలశాలతో పవిత్ర జలాలు తీసుకువెళ్తున్న భక్తులు

సబ్బవరం: ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రం దేవీపురంలోని సహస్రాక్షి రాజరాజేశ్వరీదేవి ఆలయంలో మహా మాఘీ ఉత్సవాలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. నాలుగు రోజులుగా దక్షవాటిలో చండీ పారాయణ, సహస్ర చండీ హోమాలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. దీనిలో భాగంగా పవిత్రీకరించిన 116 కలశాలల్లోని పవిత్ర జలాలను ఆహుతులైన భక్తులంతా దేవీపురంలో శ్రీయంత్ర మహామేరు నిలయంలోని 108 ఖడ్గమాల దేవతలకు అభిషేకించారు. అదేవిధంగా పౌర్ణమి సందర్భంగా సహస్రాక్షి అమ్మవారికి పంచామృతాభిషేకాలు నిర్వహించారు. శనివారం రాత్రి నుంచి ఆదివారం ఉదయం 11 గంటల వరకూ నిర్వహించిన పూర్ణాభిషేకంలో అధిక సంఖ్యలో సాధకులు పాల్గొన్నారు. అనంతరం గురుమాత అన్నపూర్ణమ్మతో పాటు గురూజీ చైతన్యానంద సరస్వతి ఆశీర్వాదం పొందడం పూర్వ జన్మ సుకృతంగా భావిస్తున్నట్లు కెనడాకు చెందిన రమేష్ నటరాజన్ తెలియజేశారు.

న్యాయవాది పొన్నగంటి మృతి



పొన్నగంటి సూకరాజు

కశింకోట : మండలంలోని నరసింగబిల్లికి చెందిన జెడ్పీటీసీ మాజీ సభ్యుడు, న్యాయవాది పొన్నగంటి సూకరాజు(55) విశాఖలోని ప్రైవేటు ఆస్పత్రిలో అనారోగ్యంతో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందారు. భార్య నాగమణి, కుమారుడు, కుమార్తె ఉన్నారు. 2005లో టీడీపీ నుంచి జెడ్పీటీసీ సభ్యునిగా ఎన్నికయ్యారు. న్యాయవాదిగా కూడా సేవలందించారు. కొంతకాలంగా రాజకీయాలకు దూరంగా ఉన్నారు.

ఆయన తన తండ్రిపై మమకారంతో సుమారు పదేళ్ల క్రితం ఆలయం కట్టించి ఏటా సంక్రాంతి రోజుల్లో తీర్థ మహోత్సవాన్ని కూడా నిర్వహిస్తున్నారు. వారం రోజుల క్రితం కూడా తీర్థం నిర్వహించారు. సూకరాజు మృతికి పలువురు సంతాపం తెలిపారు.

జీడి పూతకు మంచు కాటు



విరగపూసిన మామిడిపూత



జీడి పూతకు స్ప్రే చేస్తున్న రైతు

కోటవురట్ల : జీడి మామిడి, మామిడి రైతులకు మంచు కాటు తప్పడంలేదు. ఈ ఏడాది వర్షాలు ఆశాజనకంగా పడడంతో మామిడి, జీడి మామిడి తోటలు విరబూసాయి. పూత ఆశాజనకంగా ఉండడంతో రైతుల్లో ఎన్నో ఆశలు పట్టుకొచ్చాయి. అయితే మంచు దెబ్బకు జీడి, మామిడి రైతులకు నష్టం తప్పేటట్టు లేదు. తెల్లవారు జామున మంచు విపరీతంగా అలుముకోవడంతో పూత మాడిపోయే ప్రమాదం ఉంది. ప్రస్తుతం పూత రాలకుండా, మాడిపోకుండా ఉండేందుకు రైతులు పురుగు మందు స్ప్రే చేస్తున్నారు. నియోజకవర్గంలో వరి తర్వాత అత్యధికంగా సాగులో ఉన్న పంట జీడి, మామిడి. పాయకరావుపేట మండలంలో 3 వేల హెక్టార్లు, నక్కపల్లి మండలం 4 వేల హెక్టార్లు, ఎస్.రాయవరం మండలం 1700 హెక్టార్లు, కోటవురట్ల మండలంలో 4,500 హెక్టార్లలో జీడి, మామిడి తోటలు ఉన్నాయి. ప్రస్తుతం పొగమంచు కారణంగా జీడిలో టీ దోమ, మామిడిలో తేనెమంచు పురుగు ఉధృతి కనిపించే అవకాశం ఉంది. పంటను దక్కించుకునేందుకు రైతులు ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ప్రస్తుతం ఎక్కడ చూసినా రైతులు ముమ్మరంగా పురుగు మందులు స్ప్రే చేస్తూ బిజీగా ఉన్నారు.

తగిన మందులు మాత్రమే స్ప్రే చేయండి

ప్రస్తుతం పొగమంచు ఎక్కువగా ఉంది. దీని కారణంగా జీడిలో టీ దోమ, మామిడిలో తేనెమంచు పురుగు ఉధృతి పెరుగుతుంది. ఈ కారణంగా పూత మాడిపోయి తీవ్ర నష్టం వస్తుంది. టీ దోమ నివారణకు లీటరు నీటిలో 1.6 మి.లీ మోనోక్రోటోపాస్‌తో పాటు 3 గ్రా. బ్లెటాక్స్ కలిపి పిచికారి చేయాలి. తేనె మంచు పురుగు నివారణకు 4 లీటర్ల నీటిలో 1 మి.లీ ఇమిడా క్లోరిఫైడ్ మందును కలిపి పిచికారీ చేయాలి. తెల్లవారు జామున, సాయంత్రం సమయంలో స్ప్రేచేయాలి. ఎండలో స్ప్రేచేయకూడదు. పూత, కాండం, చెట్టు మొదలు తడిసేలా స్ప్రేచేయాలి. పూత విచ్చుకున్న దశలో స్ప్రే చేయకూడదు. ఆకు, పిందె దశలో మాత్రమే మందు స్ప్రేచేయాలి.

– ఉమా మహేశ్వరి, ఉద్యానవనశాఖాధికారి, పాయకరావుపేట

కరాటేలో ప్రతిభ చూపిన విద్యార్థులకు అభినందన



పతకాలు సాధించిన విద్యార్థులతో రిఫరీలు

పరవాడ: విశాఖలోని స్వర్ణ భారతి ఇండోర్ స్టేడియంలో ఈ నెల 4, 5 తేదీల్లో నిర్వహించిన 6వ ఇంటర్నేషనల్ కరాటే చాంపియన్‌షిప్- 2023 పోటీల్లో సింహాద్రి ఎన్టీపీసీ దీపాంజలినగర్ విద్యార్థులు సత్తా చాటారు. పోటీల్లో దీపాంజలినగర్‌కు చెందిన 9 మంది విద్యార్థులు కాటా, కుమిటి రెండు విభాగాల్లో పాల్గొన్నారు. గొర్లి వంశీ, ఎం.కుష్వంత్‌లు బంగారు పతకాలు, సిల్వర్ మెడల్ సాధించారు. సాహుఎస్.ఎం.ఖ్యాతినాథ్ బ్రాంజ్ మెడల్స్, వి.శ్రీహర్ష బంగారు పతకం, ఎ.ఎస్.ఎ కార్తికేయ బ్రాంజ్ మెడల్ సాధించారని రిఫరీలు గొర్లె పుష్పారావు, ఎం.తులసీరావు చెప్పారు.

ఘనంగా తీర్థ మహోత్సవం



కస్పావీధిలో పడమటమ్మను దర్శించుకుంటున్న ప్రజలు



కశింకోటలో ఎడ్ల బళ్ల పరుగు పోటీలు

కశింకోట : కశింకోటలోని కస్పావీధిలో ఆదివారం సాయంత్రం పడమటమ్మ తీర్థ మహోత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా పడమటమ్మ విగ్రహాన్ని అందంగా అలంకరించారు. అమ్మవారిని ప్రజలు అధిక సంఖ్యలో దర్శించి పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎండ్ల పరుగు పందెం పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఆట వస్తువుల అమ్మకాలు జోరుగా సాగాయి. సాంస్కృతిక కార్యక్రమాలు ప్రజలను విశేషంగా అలరించాయి.

ఎడ్ల బళ్ల విజేతలు

పడమటమ్మ తీర్థ మహోత్సవం పురస్కరించుకుని నిర్వహించిన జిల్లా స్థాయి ఎడ్ల బళ్ల పరుగు పోటీలో అనకాపల్లి మండలం కూండ్రంకు ప్రథమ స్థానం, చోడవరం మండలం నరసయ్యపేటకు చెందిన రెండు బళ్లకు ద్వితీయం, తృతీయ బహుమతులు వరుసగా లభించాయి. మాడుగుల మండలం కె.జె.పురానికి చతుర్థి బహుమతి లభించింది. ఈ మేరకు నగదు బహుమతులను నిర్వాహకులు అందజేశారు. పోటీలను స్థానికులు ఉత్సాహంగా తిలకించారు.

సీపీఎస్‌ను రద్దు చేయాలి



దీక్షలో కూర్చున్న ఉద్యోగ, ఉపాధ్యాయులు

అనకాపల్లిటౌన్ : సీపీఎస్‌ను తక్షణమే రద్దు చేయాలని యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి గొంది చిన్నబ్బాయి డిమాండ్ చేశారు. స్థానిక నెహ్రూచౌక్ బస్టాప్ వద్ద ఆదివారం యుటీఎఫ్ ఆధ్వర్యంలో సీపీఎస్ సంకల్పదీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీపీఎస్‌ను రద్దు చేస్తామని ఇచ్చిన హామీని నెరవేర్చి ఉద్యోగ, ఉపాధ్యాయ జీతాలు సకాలంలో చెల్లించాలని ప్రభుత్వాన్ని కోరారు. 117 జీవో ద్వారా ప్రాథమిక విద్యను ఉన్నత పాఠశాలలో విలీనం చేసి, ప్రాథమిక విద్యను నిర్వీర్యం చేశారని ఆరోపించారు. ఉపాధ్యాయులపై వేధింపులు తగవన్నారు. దీక్షలో యూటీఎఫ్ నాయకులు జి.కోటేశ్వరరావు, గంటా శ్రీరాం, ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం నాయకులు అజయ్‌కుమార్, ఉద్యోగులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వృద్ధులను ప్రభుత్వం ఆదుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న అప్పారావు

అనకాపల్లిటౌన్ : వృద్ధులను అన్ని విధాలా ప్రభుత్వం ఆదుకోవాలని వయోవృద్ధుల సంక్షేమ సంఘ వ్యవస్థాపక అధ్యక్షుడు కాండ్రేగుల అప్పారావు కోరారు. పట్టణంలోని గవరపాలెం వీవీ రమణ రైతుభారతి హాల్లో ఆదివారం నిర్వహించిన వృద్ధుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కొడుకులు, కోడళ్లకు భారంగా మారిన వృద్ధులకు ప్రభుత్వం సహాయ సహకారాలు అందించాలని కోరారు. పెన్షన్ పెంపు, బస్సు, రైలు చార్జీల్లో రాయితీలు కల్పించాలన్నారు. కార్యక్రమంలో సంఘ సభ్యులు, వృద్ధులు పాల్గొన్నారు.

నేడు పట్టణంలోకి కాంగ్రెస్ యాత్ర

అనకాపల్లిటౌన్ : హాత్ సే హాత్ జోడో అభియాన్ యాత్ర సోమవారం అనకాపల్లి పట్టణానికి చేరుకోనున్నట్టు కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి బోయిన భానుమూర్తియాదవ్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. పార్టీ నేతలు, కార్యకర్తలు ఈ యాత్రలో పాల్గొనాలని పిలుపునిచ్చారు.

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని తరలించొద్దు

అనకాపల్లిటౌన్ : మండలంలోని కొత్తూరు ఏఎంఏఎల్ కళాశాల కూడలివద్దకు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాన్ని మార్చే ఆలోచనను విరమించుకోవాలని ఆమ్ ఆద్మీ పార్టీ(ఆప్) నియోజకవర్గ కన్వీనర్ కొణతాల హరనాథ్‌బాబు అధికారులను ఆదివారం ఓ ప్రకటనలో కోరారు. జాతీయ రహదారిలో వాహనాల రద్దీ ఎక్కువగా ఉంటుందని, ఆ ప్రాంతంలో కార్యాలయాన్ని మార్చితే వివిధ పనులపై వచ్చే ప్రజలకు ఇబ్బందులు ఏర్పడతాయన్నారు.

ఐదుగురు ఆటో డ్రైవర్లపై కేసులు

కశింకోట : మండలంలోని తాళ్లపాలెంలో వాహనాల తనిఖీలో భాగంగా ఆదివారం ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన ఐదుగురు ఆటో డ్రైవర్లపై కేసులు నమోదు చేసినట్లు అదనపు ఎస్‌ఐ జె.నాగేశ్వరరావు తెలిపారు. యలమంచిలి, అనకాపల్లి, గాజువాక ప్రాంతాలకు చెందిన వారిపై కేసులు నమోదు చేసినట్టు ఎస్‌ఐ వెల్లడించారుఉ.

మసీదువీధిలో భారీ చోరీ

అనకాపల్లిటౌన్ : పట్టణంలో మసీదువీధిలో శనివారం రాత్రి భారీ చోరీ జరిగింది. స్థానికులు అందించిన వివరాలిలా ఉన్నాయి. మొల్లినాయుడు కుటుంబసమేతంగా శనివారం ఉదయం బంధువుల ఇంటికి దేవరాపల్లి వెళ్లాడు. ఆదివారం ఉదయం నాయుడు ఇంటి తలుపులు తెరిచి ఉండడాన్ని గమనించిన పొరుగింటి వారు నాయుడుకు సమాచారం అందించారు. దీంతో హుటాహుటిన బాధితుడు నాయుడు స్వగృహానికి చేరుకుని తన ఇంటిని పరిశీలించగా చోరీ జరిగినట్టు గుర్తించాడు. మూడున్నర తులాల బంగారం, 30 తులాల వెండి అపహరించబడ్డాని నిర్ధారణకు వచ్చాడు. ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

జనరాజ్‌దాస్ ఆశయ సాధనకు పాటుపడాలి



ఆర్ఈసీఎస్ మాజీ చైర్మన్ జనరాజ్‌దాస్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

మునగపాక : మునగపాక గ్రామాభివృద్ధికి నిరంతరం శ్రమించిన జనరాజ్‌దాస్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని గ్రామీణ యువజన సాంస్కృతిక సంస్థ కన్వీనర్ సూరిశెట్టి రాము కోరారు. గ్రామీణ యువజన మందిరం వద్ద ఆదివారం ఆర్ఈసీఎస్ మాజీ చైర్మన్ స్వర్గీయ పెంటకోట జనరాజ్‌దాస్ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. జనరాజ్‌దాస్ చిత్రపటం వద్ద పలువురు నాయకులు, కళాకారులు నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాము మాట్లాడుతూ విద్యుత్ సబ్‌స్టేషన్, ప్రభుత్వ ఆస్పత్రి, పీఏసీఎస్ భవనం ఏర్పాటుకు జనరాజ్‌దాస్ ఎంతో కృషి చేశారన్నారు. కళాకారులను ప్రోత్సహించడంతో పాటు ఆర్ఈసీఎస్ చైర్మన్‌గా పనిచేసిన కాలంలో వినియోగదారులకు మెరుగైన సేవలందించారన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు టెక్కలి కొండలరావు, దాడి ముసిలినాయుడు, కళాకారుడు కాండ్రేగుల జగ్గారావు, పాలసంఘ అధ్యక్షుడు మళ్ల సంజీవరావు, జనరాజ్‌దాస్ సోదరుడు శ్రీరామ్ తదితరులు పాల్గొన్నారు.

గృహసారథుల సమావేశం నేడు

పరవాడ: వెన్నెలపాలెం కల్యాణ మండపంలో సోమవారం ఉదయం 9 గంటలకు వైఎస్సార్‌సీపీ సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, గ్రామ వలంటీర్లతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసినట్టు ఆ పార్టీ మండల అధ్యక్షుడు కోన రామారావు ఒక ప్రకటనలో తెలిపారు.

ఈ సమావేశానికి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్ రాజ్, నియోజకవర్గ పరిశీలకురాలు, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి హాజరవుతారని చెప్పారు. మండలంలో పార్టీ శ్రేణులు సమావేశంలో పాల్గొని విజయవంతం చేయాలని రామారావు కోరారు.